# ధర్మపథం

## అందరిలోనూ దేవుడుంటే-

భగవంతుడు సర్వవ్యాపి అనీ, అందరిలోనూ అంతర్గతుడై ఉంటాడనీ అందరికీ తెలుసును. అతనికి దుష్టస్వభావులు, మంచివారు అనే భేదంలేదు. దుష్టుల భారాన్ని తగ్గించవలెననీ, తాను వారిని మొయ్యలేకుండా ఉన్నాననీ భూదేవి శ్రీమన్నారాయణునికి మనవిచేస్తూ, స్తుతించినప్పుడు—

"పితరోయే చ లోకానాం
 స్రష్టారోఽ త్రిపురోగమాః,
ఏతే తస్యా ప్రమేయస్య
 విష్ణోః రూపం మహాత్మనః.
యక్ష రాక్షస దైతేయ
 పిశాచోరగదానవాః,
గంధర్వాప్సరసశ్చైవ
 రూపం విష్ణోర్మహాత్మనః."

అని చెప్పినది. ఇది విష్ణుపురాణంలో ఉన్నది. ఈ విధంగా అందరిలోనూ భగవంతుడు ఉంటే కొందరిని రక్షించడం, కొందరిని శిక్షించడం ఎలా కుదురుతుంది?

"వీరు రాక్షసులు, వీరు దేవతలు." అనే వ్యత్యాసం భగవంతునికి లేదు. దుష్టులు, సాధువులు అన్న భేదం మాత్రమే ఆయన పాటించేది. ఆయన అంశ అందరిలోనూ ఉన్నా అందులో ఎక్కువ, తక్కువ భేదం ఉంటుంది.

మన చేతి వేళ్ళు ఒక్క ప్రమాణంలో ఉండలేదు. హెచ్చు తగ్గులున్నాయి. వాటి శక్తిలోనూ చాలా తేడా ఉన్నది. బొట్టన వ్రేలికి ఉన్న ప్రాధాన్యం మరొక వ్రేలికి లేదు కదా! అలాగే ఒక దంపతులకు కలిగిన సంతానంలో వ్యత్యాసం ఉండడం సర్వసాధారణం. అమాయకులు, దుష్టులు, శాంతం కలవారు, జగడాల కోరులు ఉంటారు. అమాయకులను దుష్టులు బాధ పెడుతూ వుంటే వారు తలిదండ్రులతో చెప్పుకోవడం, వారు దుష్ట స్వభావం ఉన్నవారిని శిక్షించడం ఉన్నది. అందరూ తమ బిడ్డలే! "ఆత్మా వైపుత్ర నామాసి" అని అందరూ తన రక్తం పంచుకున్నవారే! అలా అని చెడ్డ స్వభావం గలవారిని దండించకుండా ఉంటున్నారా?

భగవంతునికి ఈ జగత్తు అంతా కుటుంబమే! మంచి స్వభావం గలవారిని రక్షించడం, చెడ్డ స్వభావం గలవారిని శిక్షించడం ఆయన విధిగా భావిస్తూ ఉంటాడు. అయితే— ఆ స్వభావంలో వ్యత్యాసం ఎలా వచ్చిందీ అనేది వేరే ప్రశ్న. అది వారి వారి కర్మల ననుసరించి ఏర్పడినదే కాని వేరుకాదు.

ఈ విషయాన్ని బాగా ఆలోచిస్తే ఏయి సందేహం తప్పక తీరిపోతుంది.

— బులుసు వేంకటరమణయ్య

చెదిరిన జుత్తు నుదురుపైకి వాలుతుంటే వెనక్కి తోసుకుంటూ.... పరధ్యానంగా కాఫీ చప్పరిస్తూన్న శ్రీకృష్ణవేపు తదేకంగా చూస్తూన్న శబరి హృదయంలో ఎక్కడో.... ఏదో కదిలినట్లయింది.


కాలేజీరోజుల్లో ఎంత వుత్సాహంగా వుండేవాడు! ఎలాంటివాడెలా మారిపోయాడు! ఏడాది నిరుద్యోగ కాలమే మనిషినింతగా కృంగదీస్తుందా? మాసిన గడ్డంలో ఆ ముఖం మరింత దీనంగా కనిపించింది.

"ఈ మాత్రం దానికే ఇంతగా దిగాలు పడితే ఎలా కృష్ణా! ఈ నిరుద్యోగ సమస్య నీ ఒక్కడిది కనుకనా! దేశంలో కోటాను కోట్ల మంది వున్నారు. అందరూ యిలాగే నీరసపడిపోతున్నారా?" అలసిపోయిన కళతో చూస్తున్న అతడిని ఆ సమయంలో దగ్గరకు తీసుకుని, లాలించాలని వుబికి వచ్చిన కోరికను బలవంతంగా నొక్కిపట్టి, ఆరిందాలా ధైర్యం చెప్పింది.

క్రింది పెదవిని వెనక్కు విరిచి అదోలా నవ్వాడా మాటలకు శ్రీకృష్ణ.

"అవును శబరీ! ఈ సువిశాల దేశంలో నేనొక్కడినే నిరుద్యోగిని కాను. ఈ సమస్య నా ఒక్కడిదే కూడా కాదు. అంతమాత్రాన మా కుటుంబ స్థితిగతులెలా మారుతాయి? నీకు తెలియదు శబరీ! నాన్న పోయినప్పటి నుండీ అమ్మ ఎన్ని కష్టాలు పడిందో, మమ్మల్ని పెంచేందుకు మరెంత కన్నీటిని వెచ్చించిందో నీకు తెలియదు. ఇప్పుడు ఈ రోజు ఆమె జ్వరంతో మంచాన వుంటే, డాక్టరకు చూపించే స్తోమత కూడా లేని అసమర్థుడి నయాను. మరోవైపు వయసు పైబడుతూన్న చెల్లి. ఓహ్! ఆలోచిస్తుంటే పిచ్చెక్కుతుందేమోనన్న భయమేస్తూంది!" కణతలు రుద్దుకుంటూ ఆవేదనగా అన్నాడు.

చూస్తున్న శబరి కళ్లలోనూ కన్నీటి పొర కదిలింది. తన వూపిరిలో వూపిరిగా— ప్రాణంలో ప్రాణంగా ప్రేమించుకుంటున్న ఆ తప్త హృదయంలోని వేదనను ఏ విధంగానూ పంచుకోలేక పోతున్నాననే బాధ అణువణువులోనూ మెలికలు తిరిగి పోయింది




బేరరు తెచ్చిన చిల్లర లెక్కపెట్టుకుంటున్న నెపంతో తల దించుకుంది, మనసు బారిన చూపులను అతడు గమనించకూడదన్నట్టుగా.

మరునాడు ఫిలాసఫీ క్లాసులోంచి బయటకు వస్తున్న శబరి ఆశ్చర్యపోయింది, చెట్టు కింద నిల్చున్న శ్రీకృష్ణను చూస్తూనే. ఏడాది క్రితం బి. ఏ. అయిపోయినాక, మళ్ళీ అతడు కాలేజీలో అడుగు పెట్టడం అదే మొదటిసారి.

"ఏం కృష్ణా! ఇలా వచ్చావు!" గబగబా దగ్గరకు వస్తూ అడిగింది.

అతడిలో ఏదో వింత కాంతి మెరుస్తూంది.

"గుడ్ న్యూస్ శబరీ! సెక్రటరియేట్ విద్యుకేషను డిపార్ట్‌మెంటులో ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. రేపే ఇంటర్వ్యూ." ఆత్రంగా చెప్పాడు.

ఆ వార్త వింటూనే శబరిలో నూతుత్సాహం పెల్లుబికింది. అదేమంత పెద్ద ఉద్యోగం కాకపోయినా, తాత్కాలికంగానైనా అతడిని అశాంతి నుండి దూరం చేస్తుందేమో నన్న ఆశాభావంతో మనసు పురకలు వేసింది. అబ్బ! ఎన్నాళ్ళకు మళ్ళీ అతడిలో వెలుగు కనిపించింది. నిజంగానే అతడి కళ్ళు నవ్వుతున్నాయి.

"కంగ్రాట్స్ కృష్ణా! అయామ్ వెరీ హాపీ యూ నో విష్ యు ఆల్ ద సక్సెస్" హృదయ పూర్వకంగా చెప్పింది.

"అప్పుడేకాదు. ఎలాగైనా మీ నాన్నకు నా పేరు రికమెండ్ చేయాలి. రేపు ఆయనే ఇంటర్వ్యూ తీసుకునేది. ఆ తరువాత కంగ్రాట్స్ చెప్పు..."

అతడింకా ఏదో చెప్తున్నాడు కానీ శబరికి మాత్రం అవేవీ వినబడటంలేదు. నిజమే... నాన్న...నాన్న... రాజశేఖరం ఐ. ఏ. యస్. సెక్రటరీ టు గవర్నమెంటాఫ్ ఆంధ్రప్రదేశ్. డిపార్ట్‌మెంటాఫ్ ఎడ్యుకేషను ఇంటిముందు గాని, ఆఫీసు గదికి గాని ఆ బోర్డు చదువుకున్న వారెవరూ రికమండేషన్ను తీసుకొని లోనికి వెళ్ళడానికి సాహసించరు. హోమ్మినిస్టరంతటి పెద్దమనిషే గతంలో ఒకటి రెండు మార్లు ప్రయత్నాలు చేసి లాభం లేదని విరమించుకున్నాడు. స్టేట్ బ్యూరోక్రటిక్ సర్కిల్‌లో ఆయనంటే చాలామందికి సింహస్వప్నం. అందరికీ అదోవిధమైన గౌరవం. అలాంటి నాన్నతో ఏమని చెప్పను? ఎలా చెప్పేది. చెబితే మాత్రం వింటాడా!?

"ఏమిటా పరధ్యానం? నీవు తల్చుకుంటే నాకీ వుద్యోగం తప్పకుండా వస్తుంది. అవును శబరీ! తినడానికి రెండుపూటల భోజనం లేని నన్ను ప్రేమించావు. నా కుటుంబ స్థితిగతులు తెలిసి వుండీ, ఆ యింటికి కోడలుగా రావాలని కోరుకున్నావు. నా కోసం యీ మాత్రం చేయలేవా? నీవొక్క మాట చెప్పావంటే, ఆయన కాదనలేడు అనవసరమను కుంటే మన నిర్ణయాన్ని కూడా తెలియచేయి." ఆమె మౌనాన్ని చూస్తున్న కొద్దీ పెరిగిపోతున్న ఆందోళనతో గబగబా అన్నాడు.

అదేపనిగా అతడు అనే మాటలు చెప్తూంటే శబరికి ఒకవిధమైన విసుగొచ్చింది. "అది కాదు కృష్ణా! మన పెళ్ళి విషయం వేరు నాన్నగారి సిద్ధాంతాలు వేరు. ఆయన గురించి నీక్కూడా తెలుసు. నే నిప్పుడది కాక యిలాంటి విషయాల్లో తల దూర్చలేను. ఏమో! అడగాలంటే భయమేస్తూంది"

"పోనీ శబరీ, నీ కంత అయిష్టంగా వుంటే వద్దులే. నా అదృష్టమెలా వుంటే అలా జరుగుతుంది." చిన్నబుచ్చుకున్న అతడి కంఠంలో యీమారు నిష్ఠురత కొట్టొచ్చినట్లుగా ధ్వనించింది.

అది గమనించిన శబరి చివ్వున తలెత్తి సూటిగా చూసింది. "నీకు వుద్యోగం దొరకడం నాకు అయిష్టమని ఎలా అనగలిగావు కృష్ణా? నాన్నగారి మనస్తత్వం గురించి చెప్పాను. అంతే! అయినా ఐవిల్ ట్రై మై లెవల్ బెస్ట్. ఐ ప్రామిస్ దట్!" అంటూ చక చకా వెళ్ళిపోయింది.

*    *    *

"నిజమేనమ్మా! ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి వాళ్ళు పంపిన లిస్ట్ చూశాను. వున్నది ఒకేపోస్టు. పది మంది వస్తున్నారు. అందులో ఆరుగురు పోస్టు గ్రాడ్యుయేట్స్ వున్నారు. అఫ్‌కోర్స్. అయినంత మాత్రాన

## ఇదీ జీవితం

నీ ఫ్రెండ్ వాళ్లతో సరితూగలేడని కాదు నా అభిప్రాయం. ఐ మీన్ కాంపిటీషన్ ఈజ్ వెరీ స్టిఫ్.'' ఆ రాత్రి భోజనాలయ్యాక, కూతురు చెప్పిన విషయం విని తాపీగా పైపు వెలిగిస్తూ చెప్పాడు రాజశేఖరం.

''ఆయన చాలా కష్టాల్లో వున్నారు డాడీ! కుటుంబ పరిస్థితులు కూడా బాగులేవు వాళ్లమ్మగారు...''

''ఐనో...ఐనో ... ఆ సమస్యలు ప్రతి ఘంటల్లోనూ వున్నాయి. లేకుంటే ఫస్ట్ క్లాస్ పోస్టుగ్రాడ్యుయేట్స్, ఆఫ్టరాల్ అయిదొందలు కూడా పూర్తిగా అందివ్వనిగుమాస్తా వుద్యోగాలకెందుకు వస్తారు? ఐ నో బేబీ, ఐ నో ద ప్రెజెంట్ సిచుయేషన్ వెరీవెల్. కాని నేనేం చేయనమ్మా! ఇంటర్వ్యూ బాగా చేస్తే, తప్పకుండా వుద్యోగం దొరుకుతుందని చెప్పు'' పేపరు పేజీలు తిప్పుతూ అన్నాడు.

''అదికాదు డాడీ! హై్యర్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్‌తో సమానంగా ఇంటర్వ్యూ చేస్తాడో లేదో...''

కూతురు మాటలను మధ్యలోనే తుంచేశాడాయన ఈమారు – ''అయినా అతడికి ఉద్యోగం ఇవ్వమంటావు. అదేనా బేబీ నీవు చెప్పేది. అఫ్‌కోర్స్ అవసరంలో వున్నవారికి సహాయం చేయమంటే, నేనూ నాలుగడుగులు ముందుకు వేస్తాను. ఆ మనసూ నాకుంది. కాని బేబీ, ఆ సహాయం ఇంకొకరి సమర్థతను అణచివేయ కూడదు ఒక సమర్థుని అవకాశాన్ని నరికివేయ కూడదు. అయ్ కాంట్ డూ దట్ ఎట్ ఎనీ కాస్ట్. యూ నో దట్ ప్రెట్టీ వెల్. అందుకే బేబీ ఇంటర్వ్యూ బాగా చేయమను. అందరికన్నా బాగా చేస్తే అతడికే దొరుకుతుంది.'' తన నిర్ణయం అదే నన్నట్లుగా పేపరు మడిచి పెడుతూ బెడ్‌రూం వేపు వెళ్తున్న తండ్రివేపు అసహాయంగా చూస్తూ కూర్చుండిపోయింది శబరి.

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నప్పుడు మాత్రం కూతురుని పరీక్షగా చూశాడు రాజశేఖరం. ''ఆ కళ్లేమిటి బేబీ, అంతగా ఎరుపెక్కినయి. సరిగ్గా నిద్ర పోలేదా!''

తల వంచుకుని ప్లేట్లో వేళ్లు కదిలిస్తున్న శబరి నెమ్మదిగా తలెత్తింది ''డాడీ! ఎన్నో రోజులుగా మీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. కాని ఎలా చెప్పాలో తోచడం లేదు'' ఆ మాటలంటుంటే అప్రయత్నంగా ఆమె విశాల నయనాలు సజల పూరితాలయినయి.

నాప్‌కిన్‌తో పెదాలు తుడుచుకుంటున్న రాజశేఖరం కూతురునా స్థితిలో చూసి నివ్వెరపోయాడు. క్షణకాలం అతడి భృకుటి ముడిబడి అంతలోనే విచ్చుతుంది

''ఓకె బేబీ! లెటజ్ టాకిట్ ఓవర్ పద. అక్కడ కూర్చుని మాటాడుకుందాం.''ఆప్యాయంగా భుజాలు పట్టుకుని కుర్చీలోంచి లేవదీస్తూ అన్నాడు.

డ్రాయింగ్ రూంలో కూర్చున్న తర్వాత కంఠంలో తడి తొంగి చూస్తుంటే, మంద స్వరంతో చెప్పింది శబరి

పైపు పీలుస్తూ నిశ్శబ్దంగా వింటూ వుండిపోయాడాయన అంతా విన్నాక, ''చూడు బేబీ! మీ అమ్మవుంటే నీవు చెప్పక ముందే


**ఆపరంజ పళ్ళెరంలో ఆకర్షణీయమైన కానుక**




వైశ్యబాంకు వారి గోల్డన్ జూబిలీ క్యాషసర్టిఫికెట్ కొంటే మీ కలలు సఫలమవుతాయి.

మీరు చేయవలసిందల్లా రు. 100/- మొత్తాన్ని 63 నెలల పాటు మావద్ద మదుపు చేయాలి. ఈకాలంలో 10 డ్రాలు. తీయబడతాయి. వీటిలో రు. 16,75,000/- విలువచేసే 2,551 బహుమతులు అదృష్ట విజేతలకు అందజేయబడతాయి.

వీటికి తోడుగా ఒక లక్షరూపాయల విలువచేసే బంపర్ డ్రాకూడవుంది. మీరు తొలుత మదుపుచేసే మొత్తంపైన ఆకర్షణీయమైన వడ్డీకూడ లభిస్తుంది. మా స్వర్ణోత్సవసంవత్సరంలో సువర్ణావకాశం.

*మిగతా వివరములకు మా బ్రాంచీలలో వేటినైనా సంప్రదించండి.*

1980–స్వర్ణోత్సవ సంవత్సరము

**ది వైశ్యా బ్యాంక్ లిమిటెడ్**

రిజిష్టర్డ్ ఆఫీస్: అవెన్యూరోడ్, బెంగుళూరు 560 002
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 72, సెయింట్ మార్క్సురోడ్
బెంగుళూరు 560 001

ఛైర్మన్ : టి. కె. కె. భగవత్

Rachana VB. 62 Tel

## అమెరికన్ కాంగ్రెసులో ఈసారి ఎక్కువగా ఎన్నికైన స్త్రీలు !

'81 జనవరిలో సమావేశమయ్యే 97వ అమెరికన్ కాంగ్రెసు (పార్లమెంటు)లో 21 మంది మహిళలు వుంటారు వీరిలో 19 మంది ప్రతినిధుల సభ (దిగువసభ) సభ్యులుకాగా, ఇద్దరు సెనేటు (ఎగువసభ) సభ్యులు.

435 మంది సభ్యులు గల ప్రతినిధుల సభకు, 100 మంది సభ్యులు గల సెనేటుకి 21 మంది మహిళలు ఎన్నిక కావటం ఇదే మొదటిసారి.

ప్రస్తుతకాంగ్రెసులోఉన్న16మంది మహిళలలో 15 మంది నవంబరు 4న జరిగిన ఎన్నికలలో తిరిగి పోటీచేసి గెలుపొందారు ఇంతకు ముందు సెనేటులో స్త్రీ సభ్యురాలు ఒక్కరే ఆమె పేరు నాన్సీ కెసెబామ్. కాగా, ఈ ఎన్నికలలో మరొక మహిళ— పౌలా హాకిన్స్— సెనేటుకి ఎన్నికైనారు. ఈమె ఫ్లారిడా రాష్ట్రంనుంచి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా సెనేటుకి ఎన్నికైనారు గత 80 సంవత్సరాలలో ఈ రాష్ట్రం నుంచి సెనేటుకి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి గెలవటం ఇదే మొదటసారి.

యిలాంటి విషయాలు తెలుసుకునేదేమో! ఆమె పోయినప్పటి నుండీ, నీకు అమ్మా, నాన్నా నేనే అయి పెంచానని అనుకుంటూ వచ్చాను. కాని... కాని ఈనాడు తెలిసింది బేబీ, ఆ లోటు నేను భర్తీ చేయలేనని. అయినా నీ విప్పుడు పెద్దదానివి. చదువుకున్నావు. అన్నిటికన్నా ఎక్కువగా నా క్రమశిక్షణలో పెరిగిన నీవు త్వరపడి ఎలాంటి పొరబాటు నిర్ణయాలు తీసుకోవనే నమ్మకం నాకుంది. అందుకే బేబీ ! నీ జీవితం కోసం నీవేం చేసినా తండ్రిగా నా సహకారం, ఆశీర్వాదం ఎప్పుడూ వుంటాయి. అయినా అబ్బాయి విషయంలో మాత్రం మరొక్కమారు ఆలోచించుకోవాలమ్మా." ఆ మాటలంటుంటే మాత్రం ఆయన కంఠంలో ఏదో జీర తొంగి చూసింది.

ఆయనలో అలాటి మార్పు ఎన్నడూ చూడని శబరి కూడా పూర్తిగా కదిలి పోయిందా క్షణం. "థ్యాంక్యూ డాడీ... థ్యాంక్యూ వెరీమచ్. అందుకే డాడీ అతడికీ వుద్యోగం." ఆమె మాటలు పూర్తి కాకుండానే అందుకున్నాడు రాజశేఖరం.

"నేనూ అందుకోసమే చెప్తున్నానమ్మా! అతడిని జీవిత భాగస్వామిగా నిర్ణయించుకునే ముందు మరోసారి ఆలోచించుకోమని. అవును తల్లీ! అనాలోచితంగా చేసుకునే నిర్ణయాల వల్ల జీవితాలు కూలిపోయే ప్రమాదముంది. ఉద్యోగం కోసం తనను ప్రేమించిన అమ్మాయిపై ఆధారపడుతున్న ఆ వ్యక్తి వ్యక్తిత్వంలో ఏదో అపశృతి వుందేమోనని పిస్తోంది. మరేదో లోపముందనిపిస్తోంది"

"నాన్నా..." ఏదో కొత్త విషయం వింటున్నట్లుగా, విభ్రాంతితో అప్రయత్నంగా అంది శబరి

"అతడి అర్హతలు చూడకుండా— కేవలం నా కూతురును పెళ్లి చేసుకోబోయే వ్యక్తని మాత్రం వుద్యోగం యివ్వలేను. యివ్వను కూడా. అవును బేబీ, ప్రతి జీవితానికీ కొన్ని విలువలుంటాయి. వాటిని కాపాడుకోవడం మన ధర్మం. అలా అని మీ పెళ్లికి అభ్యంతరం చెప్పేంత కుసంస్కారిని కూడా కాను. కానీ, ఏలాంటి ఆత్మవంచనకు తావీయకుండా మరోసారి ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి ఒక నిర్ణయానికి రా! కన్నతండ్రిగా, జీవితంలో నీకన్న ఎక్కువగా అనుభవమున్న ఒక స్నేహితుడిగా నేనిచ్చే సలహా మాత్రం అదే! ఆ తర్వాత కూడా నీవు అతడినే భర్తగా కోరుకుంటే మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తాను. ఓకె దెన్. బేబీ టైమయింది. ఇంకా డ్రెస్ చేసుకోవాలి." ఆ విషయం అప్పుడే గుర్తుకు వచ్చినట్లు, సంభాషణను అక్కడికే ఆపి లేచి పోయాడు.

తర్వాత చాలాసేపటిదాకా ఆలోచిస్తూండి పోయింది శబరి. ఆలోచిస్తున్న కొద్దీ తండ్రిపై గౌరవం అపరిమితంగా పెరిగి పోయింది. అయినా, శ్రీకృష్ణపై పెంచుకున్న అనిర్వచనీయమైన ప్రేమానురాగాలు కూడా ఏమాత్రం తగ్గలేదు కాలేజీకి కూడా వెళ్లాలనిపించక, గదిలోకి వెళ్లి మంచంపై వాలిపోయింది.

ముందుగా అనుకున్న ప్రకారం ఆ సాయంత్రం హోటల్ సరోవర్‌లో కూర్చున్నాక "నీవు తప్పకుండా రికమండ్ చేస్తావనుకున్నాను. కష్టాలన్నీ గట్టెక్కుతాయని, గంపెడాశతో ఇంటర్వ్యూకు వెళ్లాను." నిష్ఠూరంగా అన్నాడు.

శబరి కూడా అతడివేపు సూటిగా చూడలేకపోయింది. "నాన్నగారి గురించి నీకు పూర్తిగా తెలియదు కృష్ణా! నమ్ముకున్న వాటికోసం వుద్యోగమే కాదు, ప్రాణాలని కూడా లెక్కచేయరాయన. ఎంతో చెప్పి చూశాను. కాని, లాభం లేకపోయింది. అయామ్ సారీ." దోషిలా సంజాయిషీ చెప్పుకుంది.

"అందులో ప్రిన్సిపుల్ ఏముంది? కన్న కూతురు మాట కూడా ఖాతరు చేయనప్పుడు, అదేం ప్రిన్సిపుల్.. ఎవరికోసం, ఎందుకోసమని...?" ఇంకా ఏదో అనబోయాడు. కాని అప్పటికే భరించలేని శబరి అడ్డుకుంది—

"పోనీ కృష్ణా ... జరిగిపోయిన దాని గురించి ఎందుకు! అయినా అదేమంత పెద్దదని ఆఫ్టరాల్ గుమాస్తా వుద్యోగం. ఒకపని చేయకూడదూ!"

ఏమిటన్నట్లుగా చూశాడతడు కుతూహలంగా.

"నా ఫ్రెండొకావిడ 'కువైట్' లో వుంటూంది. ఆమె భర్త ఒక అమెరికన్ ఫరమ్‌కు జనరల్ మేనేజరుగా వున్నాడు. నేనొక్కమాట చెప్పానంటే వాళ్లు కావలసినంత సహాయం చేస్తారు ఈ మధ్య చూస్తున్నావుగా ఎంతో మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి డబ్బు సంపాదించుకుంటున్నారు. నీవూ ప్రయత్నిస్తే..." ఆ సలహాను అతడెలా తీసుకుంటాడోనన్న సందేహంతోనే చెప్పింది

### పుట్టుమచ్చ

పులిస్టాపు అంటే
ఓ చిన్న పుట్టుమచ్చ
పుట్టుమచ్చ
జీవితంతో పుడుతుంది
పులిస్టాపు వాక్యంతో
ఆఖరవుతుంది !

— కోలూరి


"ఏమో! నా కక్కడ వుద్యోగం దొరుకుతుందంటావా? దొరికినా వెళ్ళడానికి కనీసం పదివేలన్నా కావాలేమో!"

అతడి మాటలు విన్నాక శబరిలో నూతనోత్సాహం పొంగుకొచ్చింది. "నీవు వెళ్తానంటే చాలు కృష్ణా— వుద్యోగం, డబ్బు ఆ విషయాలన్నీ నేను చూసుకుంటాను. రెండేళ్ళు చాలు— నీవు జీవితంతో స్థిరపడిపోయేందుకు కావలసినంత సంపాదించుకుని రావచ్చు. రేపే పాస్‌పోర్టుకు అప్లయి చేయాలి మరి!" ఉద్వేగంతో చెప్పింది.

వూహించని ఆ అవకాశంతో శ్రీకృష్ణలోనూ కొత్త ఆశలు చిగురించినయి. "ధ్యాంక్యూ శబరీ! నా జీవితం కోసం యింతగా శ్రమపడుతున్నావు నీకెలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలియడం లేదు. ధ్యాంక్యూ వెరీమచ్!" అతడూ వణకే కరంతో అన్నాడు.

ఆ మాటలకు బుగ్గలపై గుంటలు పడుతుంటే, అందంగా నవ్వింది శబరి. "ఏమిటో అంత బరువైన మాటలు వాడుతున్నారు. నీదీ నాదీ అంటూ వేరు వేరు జీవితాలా. మన జీవితమనండి. నీవురాగానే శాశ్వతంగా ఒకటయిపోదాం. ఒక విషయం చెప్పనా కృష్ణా! డాడీ కూడా మన పెళ్ళికి సంతోషంగా అంగీకరించారు. హి యీజ్ సచ్ ఎ వండర్‌ఫుల్ మాన్ యూ నో!"

"అవును శబరీ! మీనాన్న చాలా మంచివాడు. నాకు వుద్యోగం ఇవ్వకున్నా మన పెళ్ళికి ఒప్పుకున్నాడంటే అర్థం చేసుకోగలను. అయినా రెండేళ్ళు ఎంతలో గడిచిపోతాయని."




## ఇదీ జీవితం

అవును! రెండేళ్ళు ఎంతలో గడిచిపోతాయని. రెండేళ్ళే కాదు. ఒకదాని వెనక ఒకటి వరసగా నాలుగేళ్ళు గడిచి పోయినయి. ఆ కాలంలో ఎన్నో మార్పులూ వచ్చినయి. తన బి. ఏ. అయిపోయింది. ఎమ్మే ఫైనలియర్లో వున్నప్పుడు నాన్నగారు చీఫ్ సెక్రటరీగా రిటయరయిపోయారు. ఎమ్మే పూర్తయినాక తను గవర్నమెంటు వుమెన్స్ కాలేజీలో ఫిలాసఫీ లెక్చరర్‌గా చేరింది. అది జరిగీ దాదాపు సంవత్సరం కావస్తూంది.

వెళ్ళిన రెండేళ్ళ తర్వాత ఒకమారు మాత్రం వచ్చాడు శ్రీకృష్ణ అక్కడికి వెళ్ళగానే శబరి స్నేహితుల సహాయంతో ఒక ఆయిల్ కంపెనీలో మేనేజరు వుద్యోగం సంపాదించిన అతడు, ఆ స్వల్ప వ్యవధిలోనే పూర్తి గల్ఫ్ దేశాలలో వున్న ఆ సంస్థ బ్రాంచీలకు ఇన్‌ఛార్జ్ అయ్యాడు. ఇక్కడ కేవలం అయిదు వందల ఉద్యోగం సంపాదించలేని శ్రీకృష్ణ నెలకు పాతికవేలకు పైగా సంపాదించడం ప్రారంభించాడు.

ఆనాడూ ఇలాగే ఎదురు వెళ్ళింది తను. ఖరీదయిన సూటులో, ఐశ్వర్యం ఆపాదించిన రీవితో హుందాగా వున్న శ్రీకృష్ణను ఎయిర్‌పోర్టులోనే తనివితీరా చూసింది.

"చాలా మారిపోయావు కృష్ణా!" అప్రయత్నంగానే అంది ఆనాడు.

"అవును శబరీ! ఒకప్పుడు గుమాస్తా ఉద్యోగం కోసం మీ నాన్నను దేవిరించాను. ఇప్పుడా అవుసరం లేదు. డబ్బు సంపాదించడం, ఆ సంపాదనను అనుభవించడం నృకున్నాను నేర్చుకోవడమే కాదు శబరీ, అలవాటు అయిపోయింది." ఒక విధమైన ఆత్మ విశ్వాసంతో మందహాసం చేస్తూ అన్నాడు

ఆ సంభాషణలో అసందర్భంగా డాడీ విషయం రావడంతో చిన్నపుచ్చుకుంది శబరి మనస్సు. అయినా బయటకు కనిపించనియకుండా "అలా అనకు మరి! అనాడే నాన్నగారే కనక ఆ వుద్యోగం యిచ్చివుంటే యిప్పుడీ అవకాశం వుండేది కాదు ఏది జరిగినా మన మంచికే అనుకోవాలి!" తేలిగ్గా అంది.

*　　*　　*

"రెండేళ్ల తర్వాత పూర్తిగా వచ్చేస్తావనుకున్నానే కాని, మళ్ళీ వెళ్తావనుకోలేదు కృష్ణా' నెలరోజుల తర్వాత వెళ్తున్నానని చెప్పడానికొచ్చిన శ్రీకృష్ణతో ఆర్తిగా అంది శబరి.

"అప్పుడలాగే అనుకున్నాను కాని, ఇక్కడే ముందని శబరీ! ఇంకో రెండేళ్ళంటే మరో నాలుగు లక్షలు సంపాదించవచ్చు. అప్పుడే దయినా బిజినెస్ చేసుకునే అవకాశం వుంటుంది" ఎటో చూస్తున్న చూపుల్లో బంగారు స్వప్నం ఛాయాల లూగుతుంటే కలలోలాగ చెప్పాడు

"నీ యిష్టం రెండేళ్ళే కాదు నీ కోసం ఈ జన్మంతా ఎదురు చూస్తుంటాను. క్షేమంగా వెళ్ళిరా" సజల నేత్రాలతో సాగనంపింది

ఆ తర్వాత రెండేళ్ళలో ఎన్నో వుత్తరాలు వ్రాసింది. అతడు మాత్రం నాలుగయిదుకు మించి వ్రాయలేదు తనిప్పుడు మరీ పెద్ద పదవిని చేబట్టాడని, నెలకు మూడునాలుగులకు పైగా విదేశాల్లోనే గడపవలసి వస్తూందని, అందుకే తరచుగా వ్రాయడానికి కుదరడం లేదని అన్నిటికీ కాబోలనుకుని సరిపెట్టుకుంది

ఇప్పుడు ఈరోజు పూర్తిగా మళ్ళీ వెళ్ళేందుకు కాకుండా, తనతోనే శాశ్వతంగా వుండిపోవడానికి వచ్చేస్తున్నాడు. యిన్నేళ్ళ నిరీక్షణకొక నిర్వచనం దొరకబోతూంది

బొంబాయి నుండి వచ్చే 'ఎయిర్ బస్' మరో కొన్ని క్షణాల్లో 'రన్‌వే' పైకి వస్తుందని అనౌన్సరు చెప్పేదాకా గతస్మృతుల ఒరవడిలో కొట్టుకుపోతున్న శబరి వాస్తవంలోకి అడుగిడలేక పోయింది.

లాంజ్ లోకి ప్రవేశిస్తూనే పూలదండలతో, పుష్పగుచ్ఛాలతో శ్రీకృష్ణను చుట్టుముట్టిన గుంపును చూస్తూనే ఆశ్చర్యపోయింది శబరి, ఇంతమంది అప్తులెవరబ్బా... అనుకుంటూ. అందరి కన్న ముందుగా మొట్టమొదట తనే ఎదురువెళ్లి స్వాగతం చెప్పాలని ఎంతోకాలంగా ఈ రోజు కోసం ఎదురుచూసింది. చివరకు యిలా అయిందేమిటి? అభిమానంగా తెచ్చిన గులాబీల గుత్తిని ఒడిసి పట్టుకుంటూ ఓ వారగా నిలబడిపోయింది.

దాదాపు అరగంట పరామర్శల తర్వాత తనను గమనించకుండానే వెళ్లబోతూన్న శ్రీకృష్ణను చూస్తుంటే మాత్రం గుండెలు విపరీతంగా వూగిపోయినయి. "కృష్ణా!" ప్రేవులన్నీ మెలికలు తిరిగిపోతుంటే ఇక వుండబట్టలేక వణకే కంఠంతో పిలిచింది.

వెనక్కు తిరిగి చూశాడతను ఆ పిలుపు వింటూనే! చూస్తూనే అపరాధిలా కొయ్యబారి పోయాడు.

"కృష్ణా!" అంటూ పరుగెత్తుకెళ్లింది శబరి. "కృష్ణా...కృష్ణా.. కృష్ణా" అంటూ హృదయం అదేపనిగా గొణుక్కుంటూంటే భుజంపై తల వాల్చి కన్నీరు కార్చింది

## ఇదీ జీవితం

"ఛ! ఛ! ఇదేమిటి, అందరూ చూస్తున్నారు వూరుకో!" యిబ్బందిగా విడదీసుకుంటూ అన్నాడు.

### నూనె మంటలు

ఇరాన్ నూనె సరఫరాలు నిలిచి పోవడం వల్ల రోజుకు 21 మిలియన్ల డాలర్లు, ఇరాక్ నూనె సరఫరాలు నిలిచి పోవడం వల్ల రోజుకు 84 మిలియన్ డాలర్లు నష్టం వస్తూ వుందని పశ్చిమ రాజ్యాలు అంచనా వేశాయి. తొలి మాసం యుద్ధంలో ఇరాన్ నూనె కర్మాగారాలకు 8000 మిలియన్ డాలర్లు, ఇరాక్ నూనె కర్మాగారాలకు 9000 మిలయన్ డాలర్ల మేరకు నష్టం వాటిల్లిందని "పెట్రోల్ ఎట్ గ్యాస్ అరబ్" అనే పత్రిక అంచనా వేసింది. యుద్ధ రంగంలో ఉభయ పక్షాలకూ గణనీయమైన సైనిక నష్టం జరిగింది.

"కృష్ణా, నన్ను మరచిపోయావా?" గాద్గదికమైన కంఠంతో అడిగింది

"నిన్ను మరచిపోవడమేమిటి నాన్సెన్స్! కాలేజీమైము కదా, వచ్చావోలేదో నను కున్నాను అంతేకాని మరేంలేదు పద" అంటూనే బయటకు నడిచాడు

కారెక్కేటప్పుడు మాత్రం, "సాయంత్రం పార్టీ వుంది శబరీ! నా కొత్త భవనం తెలుసుగా...తప్పకుండా రావాలి!" ఎవరినో విష్ చేస్తూనే చెప్పాడు.

మాటలు రానిదానిలా, చేష్టలుడిగిన దానిలా నిల్చుండిపోయిన శబరి ... కారు కనుమరుగై పోతున్నప్పుడు తలాడించింది సరేనన్నట్లుగా

*    *    *

విశాలమయిన ఆ భవంతి కన్నులపిందుగా అలంకరించ బడింది. ముందున్న గార్డెన్ లోని కొమ్మ కొమ్మకూ, రెమ్మ రెమ్మకూ, ఆ అవరణంతా అంగుళ మంగుళమూ అమర్చిన విద్యుద్దీపాలు ప్రశాంతంగా వెలిగి పోతుంటే, ఆకాశంలోని చుక్కలన్నీ జా

(49 వ పేజీ చూడండి)

ఆస్ప్రో రెట్టింపు వేగంతో బాధ నివారిస్తుంది
నిజం, రెట్టింపు వేగంగా!





ఇతర సాధారణ బాధానివారణ మాత్రలకంటే రెట్టింపు వేగంగా పనిచేస్తుంది.
ప్రతి ఆస్ప్రో మాత్రలోని ఔషధ విశేషం మైక్రొఫైన్ చేయబడింది. ఇది ఇతర సాధారణ మాత్రలకంటే 30 రెట్లు ఎక్కువగా చూర్ణం చేయబడిన సన్నని అణువులతో తయారు చేయబడుతోంది. అందుకని అది మీ శరీరంలో రెట్టించిన వేగంతో కలిసి పని చేస్తోంది తలనొప్పి, ఒళ్ళునొప్పులు, పంటి నొప్పులు, జలుబు మరియు ఫ్లూ మొదలైన వాటిని రెట్టించిన వేగంతో నివారిస్తుంది.
పెద్దవారికి మోతాదు: 2 మాత్రలు.

మైక్రొఫైన్డ్
ఆస్ప్రో
Nicholas




ఎందుకంటే
ఆస్ప్రో ఒక్కటే మైక్రొఫైన్డ్ చేయబడింది.
Sista's-NIA-392/80 TL




# ఫాలాక్షుని డైరీ

## భయపెట్టే భవనం !

ఇటలీకిచెందిన పిసా అనే నగరంలో 1173వ సంవత్సరంలో బొనానో పిసానో అనే శిల్పి ఒక అద్భుతమైన భవనాన్ని నిర్మింపదలచి నగరంలో మిరకిల్స్ స్క్వేర్‌లో ఆరంభించి తెల్ల పాలరాతితో మూడంతస్థుల భవనాన్ని నిర్మించేసరికి ఆ భవనం వో పక్కకు వాలిపోయిందట. దాంతో ఆపూరి వారతన్ని వూరునుంచి బహిష్కరించారట. ఆ తరువాత వో వంద సంవత్సరాలకు గియోవన్ని సిమన్ అనే శిల్పి మరో నాలుగంతస్థులు కట్టి ఆ ఒంపుతగ్గుతుందేమోనని ప్రయత్నించి విఫలుడయ్యాడట. అనక వో ఎనభై సంవత్సరాలకు టొమసో పిసానో అనే ఆయన ఎనిమిదో అంతస్థు, టూంబు కట్టేశాడట. ఈ విధంగా యీభవనం కట్టడానికి రెండు శతాబ్దాలు పట్టిందట. ఇప్పుడీ భవనం సుమారు అయిదు మీటర్లు ఒరిగి ఉందట. 800 ఏళ్లకుపైగా ప్రజలను భయపెడుతూనే స్థిరంగా వున్న యీ భవనమిహ ఎన్నాళ్లో ఉండదనీ మహా అయితే వో పదేళ్లనీ ఇంజనీర్లు లెక్కలు కట్టున్నారట. టూరిస్టులు 1964 వరకూ యీ భవనం ఎక్కడానికి అనుమతి వుండిందట. ఇప్పుడు చుట్టూ ముళ్ల తీగలుకట్టి, దరిదాపులకు ఎవరినీ వెళ్ళనివ్వకుండా కాపలా కాస్తున్నారట. ఆ ప్రాంతాలలో కారుల హారనులవంటి వాటిని కూడా నిషేధించారట. ఈ ఎనిమిది అంతస్థుల భవనానికి 294 మెట్లున్నాయట. ఏడాదికి టూరిస్టుల మూలంగా 50 లక్షలు సంపాదించేదట.

## నగ్నసాధువు ఘాతుకం !

పూనై జిల్లాకు చెందిన భోర్‌గిరి గ్రామంలోని కోటేశ్వరుని ఆలయంలో 45 సంవత్సరాల మహాదేవగిరి గోదావరి నంగా బాబా అనే వో సన్యాసి రాజుగారు పూర్తి నగ్నంగా తిరుగాట్టం బాగులేదనీ, ఆ ఆలయానికి వచ్చే ఆడవారికి యిబ్బందిగా ఉందనీ ఆదివాసి సంఘానికి చెందిన శ్రీపతి బావువాజీ అనే ఆయన ఆ సాధుగారికి నచ్చచెప్పబోయారట. దానికా సన్యాసి రాజుగారా శ్రీపతిని తన ఆశ్రమంలోకి తీసుకువెళ్లి గొడ్డలితో నరికి వో గోనెసంచిలో ముక్కలు వేసికట్టి, దాన్నితగులబెట్టేశారట. ఇది పోయిన ఏప్రియల్ 14 వ తేదీన జరిగిందట. పోలీసులు తీగలాగి డొంక కదిలించి యీ సాధును పట్టి, చట్టానికి ఒప్పగిస్తే చట్టం ఆతనికి యావజ్జీవ శిక్ష వేసిందట.

## ఖైదీల కళ్లుపొడిచిన పోలీసులు !

బీహారుకు చెందిన భాగల్పూరు జిల్లాలోని పోలీసులు దోపిడీదారులను, బందిపోట్లను పట్టుకుని జైల్లో పెట్టి వారికి గుణపాటం చెప్పాలంటూ వారి కళ్లలో యాసిడ్ పోసి, వారిని గుడ్డివారిని చేస్తున్నారట. యాసిడ్ సమయానికి దొరక్క చేతికందిన మేకు పెట్టో సూది పెట్టో కళ్ళు పొడిచేస్తున్నారట. 28 ఏళ్ల ఉమేష్ యాదవ్ అనే అతన్ని పట్టుకుని ఫిబ్రవరి 16 వ తేదీన ముజాహిద్‌పూరు జైలుకు తీసుకు వెళ్ళి అతని కళ్లల్లో ద్రావకం పోసి, గుడ్డి వాడయ్యాడని నిర్ధారణ చేసుకున్నాక యింటికి పంపేశారట. ఫిబ్రవరి నుంచి అక్టోబరు వరకూ భాగల్పూరులో మొత్తం 25 మంది ఖయిదీలను పోలీసులు అంధులుగా మార్చేశారట.

ముంగిట్లోనే వాలాయేమోనన్న భ్రాంతి కలుగుతూంది చూపరులకు.

"హలో శబరీ!" అంటూ పొడిగా ఆహ్వానించాడు కృష్ణ. అర్ధరాత్రి దాకా జరిగిన ఆ పార్టీలో, అయిదు నిమిషాలయినా ఏకాంతంగా మాట్లాడే అవకాశం దొరకలేదు.

"అవన్నీ ఇప్పుడెందుకు శబరీ! వచ్చింది ఈ రోజేగా, తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం !" చివరకు ఎలాగో వీలు చూసుకుని విషయాన్ని కదిపిన శబరితో విసుగ్గా అంటూ గుంపులో కలసిపోయాడు శ్రీకృష్ణ.

ఆ మాటలకు ఆమె నవనాడులూ కృంగిపోయినాయి. ఆ తర్వాత కూడా అక్కడ వుండాలనిపించక వెంటనే బయట పడింది.

## ఇదీ జీవితం

[14 వ పేజీ తరువాయి]

"బేబీ, ఒక్కమాట అడగనా" ఇంకా సంధ్య చీకట్లు విచ్చుకోని ఆ నాటి ప్రభాత వేళ, టాంక్ బండ్‌పై నెమ్మదిగా నడుస్తున్నప్పుడు అడిగాడు రాజశేఖరం.

ఏదో ఆలోచిస్తూ, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న శబరి ఆ మాటలకు వులిక్కిపడింది.

ఆ తత్తరపాటును గమనించి రాజశేఖరం ఆప్యాయంగా ఆమె అరచేతిని నొక్కాడు, "నాతో చెప్పకూడదా బేబీ" అంటూ. ముల్లోకాల్లోని అనురాగమంతా ఆ పలుకుల్లో కలబోసుకుని ఒలికింది.

"కాసేపు కూర్చుందాం డాడీ!" సమాధానం చెప్పకుండా, నీటికి అభిముఖంగా వున్న చెక్క బెంచీపై కూర్చుంటూ అంది శబరి.

అప్పుడప్పుడే చీకటి తెరలు విచ్చుకుంటున్నాయి. సూర్యభగవానుని ఆగమానానికి చిహ్నంగా ఆకాశమంతా ఎరుపెక్కింది. అరుణిమ దాల్చిన ఆ వాతావరణంలో వింతగా మెరిసిపోతున్న కూతురి ముఖాన్ని పరీక్షగా గమనించాడు రాజశేఖరం.

"నా జీవితంలో బాధ్యతాయుతమైన పదవులు చాలా చేపట్టానమ్మా! ఆ కాలంలో ఎంతోమంది నా ముందుకు వచ్చారు, ఎన్నో

సెక్సు హాస్పటల్



దురభ్యాసాలకు లోనై దాంపత్య సౌఖ్యంఅనుభవించ లేనివారు వెంటనే సంప్రదించండి!

డా॥ A. పూర్ణచంద్రరావు
(సెక్సు స్పెషలిస్టు) N.D. F.N.F.U.(CEYLON). R.A.M.P
సుఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స
Phone No. : 63753

1981 సినిమాడైరీ
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు రూ. 5/-
తెలుగు, హిందీ నటీనటుల అడ్రసులుగల 1981 సినీ డైరీ రూ. 2/- ఎం. ఓ. చేయండి
వై. కె. మూర్తి
దాసరి వారి వీధి, విజయవాడ-2.




శ్రీ గోల్డు కవరింగ్ వర్క్సు Regd
P.B.No. 35. శ్రీమహల్, మచిలీపట్నం. A.P.

1. పెడ్డాభి మార్కెట్..... మచిలీపట్నం
2. శేషయ్య వీధి ....... విజయవాడ-1
3 ట్రంకు రోడ్డు.......... నెల్లూరు
4 G కార్ స్ట్రీట్......... తిరుపతి
5 గాంధీ రోడ్డు.......... తిరుపతి
6. సుభాష్ రోడ్డు.......అనంతపురం
7. ఎవెన్యూ రోడ్డు....... బెంగుళూరు
8. గాంధీ బజారు....... బెంగుళూరు
9 గాంధీ బజారు.........షిమోగా
10. మునిసిపల్ మార్కెట్ ......కర్నూలు
11 జయంతి బిల్డింగ్స్ .....బెంగుళూరు
12. మద్రాసు రోడ్డు.........కడప
13 రామన్‌కోయిల్ స్ట్రీట్.... చిత్తూరు
14. నాగులకుంటరోడ్డు . నంద్యాల
15. గాంధీవిగ్రహంవద్ద - నర్సరావుపేట .
16 అమ్మవారిశాలవద్ద , మార్కాపురం.


## ఇదీ జీవితం

సమస్యలు చెప్పుకున్నారు. మరెంతోమంది వారి జీవితాలను నా ముందు పరచి న్యాయం చెప్పమన్నారు. సాధ్యమైనంత వరకూ అందరినీ తృప్తిపరచాను బేబీ నా లైఫ్‌లో ఎన్నో చిక్కు ప్రశ్నలకు జవాబులు చెప్పాను. కాని... కాని ఈనాడు నా కూతురే జీవితంలో ఓడి పోతుంటే అదంతా వ్యర్థమనిపిస్తోంది. అవును బేబీ! జరిగిందేమిటో చెప్పమ్మా! అడిగేందుకు, తండ్రిగా నాకా మాత్రం బాధ్యత లేదంటావా?'' ఆవేదనగా అన్నాడు.

''మీతో కాక ఇంకెవరితో చెప్పుకోను. ఫిలాసఫీలో డాక్టరేట్ తీసుకున్నా, ప్రాక్టికల్‌గా మాత్రం మనుష్యుల మనస్తత్వాలు అర్థం చేసుకోవడంలో ఓడిపోయాను డాడీ! శ్రీకృష్ణను మనసారా ప్రేమించాను. అతడితో నా జీవితాన్ని వూహించుకున్నాను అభిమానాన్ని, అంతరంగాన్ని చంపుకుని, అతడి భవిష్యత్తు కోసం మీ ముందొకనాడు మోకరిల్లాను చివరకు అతడీనాడు యింతటి వాడవడానికి కారణమయ్యాను అయినా డాడీ నేను ఏ డబ్బుకోసమయితే అతడిని విదేశాలకు పంపానో, ఆ డబ్బే అతడిని కొనేసింది. కొత్తగా ప్రారంభించబోయే ఫ్యాక్టరీ పార్ట్‌నర్‌కొక చెల్లెలుందట. ఆమెను పెళ్ళి చేసుకుంటాననని ఎప్పుడో వాగ్దానం చేశాడట. ఆ వాగ్దానమే తన వున్నతికి మెట్లు వేసిందట. ఇప్పుడు కాదంటే తన బిజినెస్, అందులోని డబ్బూ, తద్వారా భవిష్యత్తూ అన్నీ నాశనమయి పోతాయట ఆ మాటలు విన్నాక మరోమాట మాట్లాడలేక పోయాను డాడీ! అలాంటి మనిషికి గతాన్ని గుర్తుచేస్తే నన్ను నేనే కించపరచు కున్నట్లవుతుందనిపించింది.'' తళ తళ మెరిసే తటాకంలోంచి అగ్నిగోళంలా పైకి లేస్తూన్న బాలభానుణ్ణి తదేకంగా చూస్తూ నిర్లిప్తంగా చెప్పుకు పోయింది.

భుజాలమట్టూ చేతులు వేసి కూతురును దగ్గరగా తీసుకున్నాడు రాజశేఖరం. ''అవునమ్మా! నీవన్నదీ నిజమే. నీకు జ్ఞాపకముందో లేదో కాని, నేనొకనాడు చెప్పాను బేబీ! అతడి వ్యక్తిత్వంలో ఏదో అపశృతి వుందని, మరేదో లోపముందని. కొందరంతే. జీవితంలోని ప్రతివిషయాన్నీ లాభనష్టాలతో బేరీజు వేస్తారు. సరే బేబీ! జరిగిందేదో జరిగిపోయింది చేదు గతానెప్పుడూ మందు గుళికలా మింగడం నేర్చుకోవాలి అప్పుడే భవిష్యత్తు ఆరోగ్యంగా, అందంగావుంటుంది'' అంటూ లేవదీశాడు.

అది జరిగిన రెండు నెలల్లోనే శబరికి ఢిల్లీ ట్రాన్స్‌ఫరయ్యింది. కారణాలు అడగాలనుకుని కూడా అడగలేక పోయాడు రాజశేఖరం, అర్థం చేసుకున్నవాడిలా.

ఢిల్లీకి వెళ్ళినాక, ఆ సంవత్సరం జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో దేశ మంతటికీ ప్రథమస్థానంలో వుత్తీర్ణురాలయి ఐ. ఏ. యస్. కి వెళ్ళింది.

ట్రయినింగ్ అయిపోయి, ప్రొబేషను పూర్తిచేసుకొన్నాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఒక పబ్లిక్ రంగ సంస్థకు మానేజింగ్ డైరక్టరుగా నియమితురాలయింది. చార్జి తీసుకున్నరోజు— అన్నేళ్ళ కృషికి ఫలితం కనిపించిన ఆ క్షణం సజల నేత్రాలతో పాదాలను స్పృశిస్తున్న కూతురును లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడు రాజశేఖరం.

## సమత

ఈ దేశంలో కులాలు—
రాజకీయ నాయకుల
పొలాలు—
పండిస్తారు వాటిల్లో
పదవులు
కుట్టేస్తారు నిజాయితీ
పెదవులు—
కులం వాళ్ళకి కూడు
పెడుతుంది—
దాని బలం
వాళ్ళకి కూడ
పెడుతుంది—
ఈ వర్ణాలు తీసేస్తే
పండిస్తాం సువర్ణాలు—
అంటారు
మామూలు జనం
కులమత సామరస్య
సమత కోరుతుంది
మానవత !

చివుకుల రామేశ్వర్

పది రోజుల తర్వాత ఒక ఆదివారం సాయంత్రం బంగళా ముందున్న లాన్‌లో కూర్చుని తాపీగా కాఫీలు చప్పరిస్తూ పిచ్చాపాటీ చెప్పుకుంటున్నారు రాజశేఖరం, శబరీ

వారి ఏకాంతాన్ని భంగపరుస్తూ వచ్చాడు జవాను, "ఎవరో ఒకావిడ మిమ్మల్ని చూడాలంటుంది మేడమ్" అంటూ

ఛార్జి తీసుకున్న మరుక్షణం నుండే ఎందరో పెద్ద మనుష్యుల కొత్త మేనేజింగ్ డైరెక్టరు ప్రాపకం కోసం రాకపోకలు సాగించే ప్రయత్నాలు చేశారు. ఒక విధమైన క్రమశిక్షణలో వ్యక్తిత్వాన్ని మలచుకున్న శబరికి ఆ పద్ధతులంటే, అలాంటి మనుష్యులంటే విపరీతమైన అసహ్యం చివరకు ఇక భరించలేక, ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇంటివద్ద ఎవరినీ చూడకూడదని నిర్ణయించుకుంది ఇప్పుడెవరీమె! తనతో ఏంపని! ఆలోచిస్తూ వుండిపోయింది.

"పంపించు!" రాజశేఖరమే కల్పించుకుని చెప్పాడు

దాదాపు పాతికేళ్ళుంటాయేమో! మాసిన పైటను బుజాలనిండుగా కప్పుకుని బెదురుతూ వచ్చిందావిడ. ఆమెను గుర్తు చేసుకోవాలని విఫల ప్రయత్నం చేసి విఫలురాలయింది శబరి.

"మిమ్మల్నెప్పుడూ చూసిన గుర్తు లేదు." పరీక్షగా చూస్తూ అంది.

"నిజమే! మీరు నన్నెప్పుడూ చూడలేదు. నేను శ్రీకృష్ణగారి భార్యను." నేలచూపులు చూస్తూ చెప్పింది.

ఆ పేరు వింటూనే తుళ్ళి పడింది శబరి ఈవిడ శ్రీకృష్ణ భార్యా! మరి ఈ దీనావస్థ ఏమిటి? అంత ఆస్తి ఏమయినట్టు! తనను చూడాలనుకుంటే అతడే రావచ్చుకదా! అప్రయత్నంగానే చూపులు ఆవిడ ముఖంపైకి పారాడాయి. మబ్బుల్లోని చంద్రునిలా గుడ్డిగా మెరుస్తూంది నుదుటిపైన తిలకం ఈవిడకు తనతో ఏంపని ?

చెలరేగుతున్న ఆ సంఘర్షణను విన్నట్టుగా తనే చెప్పింది ఆవిడ– "అమ్మగారూ ! విలువయిన మీ కాలాన్ని వృథా చేయకుండా నేను వచ్చిన పని విన్నవించుకుంటాను. విన్నతర్వాత మీరే నిర్ణయం తీసుకోండి మూడేళ్ళ క్రితం మేం పెళ్ళి చేసుకున్న కొద్ది రోజుల్లోనే వారికి కేన్సరని చెప్పారు ప్రారంభ దశలో వుందని, అమెరికావెళ్ళి ఆపరేషను చేయించుకుంటే బతికే అవకాశముందని డాక్టర్లు సలహా యిచ్చారు. వున్న యిల్లును అమ్మేసి, దానికి తోడుగా దాచుకున్న డబ్బునూ తీసుకుని అమెరికా వెళ్ళాము. రెండు లక్షలకు పైగా ఖర్చయిందప్పుడు. ఆ సంవత్సరం మేమిక్కడ లేనందువల్ల ఫ్యాక్టరీలో విపరీతమైన నష్టం వచ్చిందన్నారు. అది భర్తీచేసేందుకు పెట్టుబడి లేక మా వాటా అమ్ముకోవలసి వచ్చింది..." క్షణంసేపు చెప్పడం ఆపి– పైట చెంగును నోటి కడ్డంగా నొక్కిపట్టిందావిడ, వచ్చే దుఃఖాన్నాపుకుంటూ.

కొయ్యబొమ్మలా, కనురెప్పకూడా కొట్టకుండా వింటున్న శబరిలోని నరాలన్నీ జివ్వుమన్నాయి 'ఓహ్... కృష్ణా... కృష్ణా' అనిర్వచనీయమైన ఆవేదన ఏదో గుండెలను పిండివేసింది.

కాసేపయినాక మళ్ళీ ఆవిడే చెప్పడం ప్రారంభించింది– "మీ వద్ద యిలా సిగ్గువిడిచి చెప్పుకుంటున్నందుకు, నేను చచ్చిపోతే బాగుండు ననిపిస్తూందమ్మగారూ ! మీ ముందుకు వచ్చి మీతో ముఖా ముఖిగా మాట్లాడే ధైర్యం వారికి లేదు. కాని.. కాని ...నన్ను చూడండమ్మా! నేను వారి భార్యను. వారి బిడ్డకు తల్లిని. వారికోసం – అభిమానం, సిగ్గేమిటి ? ప్రాణాలయినా సరే విడిచిపెట్టడానికి వెనుకాడను. అందుకే నమ్మగారూ! మా పరిస్థితినంతా మీతో విన్నవించుకొనేందుకు ఇలా వచ్చాను."

"అదేంలేదు. చెప్పండి." అప్రయత్నంగా ఆ మాటలు పెదాలు దాటి వచ్చినాయి.


"ఆపరేషను చేయించుకుని తిరిగివచ్చిన తర్వాత సంవత్సరం దాకా వున్న వస్తువులు అమ్ముకుని బతికాము. ఆ కాలంలో ఆయనే పనీ చేయలేకపోయారు. కాని ... కాని అమ్మగారూ, ఏడాది నుండి మా పరిస్థితి మరీ హీనంగా వుంది ఆయనకు మందులు కొనడానికి కూడా వీలు కావడంలేదు." కన్నీటిపొర ఒకటి కంఠానికి అడ్డు రావడంతో మళ్ళీ ఆగిపోయిందావిడ.

శబరి కళ్ళు కూడా చెమ్మగిల్లినాయి. "మరి...మరి...నేనేంచేయగలను...ఏం చేయగలనో చెప్పండి!" బలవంతంగా అంది.

"మీ కార్పొరేషనుకు ఎంప్లాయిమెంట్ నుండి ఎల్డీసీ వుద్యోగాలకోసం లిస్టు పంపారు. కానీ సీనియార్టీ లేదని– వాళ్ళు నా పేరును రికమండ్ చేయలేదు. అయినా ... అయినా ...అయినా మీరు తలచుకుంటే..." ఆ వాక్యాన్ని పూర్తిచేయలేక మధ్యలోనే బొటనవేలితో వచ్చికపై గీతలు గీస్తూ నిలబడింది.

గాఢంగా నిట్టూర్చింది శబరి. కళ్ళు మూసుకుని అప్పటిదాకా విన్నదంతా నరనరాల్లో జీర్ణంచేసుకుంటూ వుండిపోయింది. అప్పటిదాకా కేవలం శ్రోతగానే మిగిలిపోయిన రాజశేఖరం కూడా ఆ క్షణం కూతురు నుండి వచ్చే సమాధానం కోసం నిరీక్షించాడు.

"నన్ను క్షమించమ్మా ! రూల్సుకు విరుద్ధంగా మా కార్పొరేషనులో మీకు వుద్యోగం యివ్వలేము. కాని, కాని, మీ వారికీ నాకూ గతంలో వున్న పరిచయాన్ని పురస్క-



దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు,హెర్నియా, దర్మవ్యాధులకు బొబ్బ ద్వారావరిబీజము(బుడ్డ), మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, డబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి

డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచి : మార్వాడిగుడివద్ద, తెనాలి. ఫోన్ : 551.

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డీ గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17





నోటి దుర్గంధమును పోగొట్టి రోజంతా తాజాగా ఉంచుటకు

జ్వాల
టూత్ పౌడరు
తయారుచేయువారు
శ్రీరామ ఇండస్ట్రీస్
గుంటూరు-1
స్టాకిస్టులు కావలెను
SANTI ARTS GUNTUR

ఇంజనీరింగ్ డిప్లొమా హోల్డర్సుకు

## సదవకాశం

మీరు రెండు సంవత్సరాలలో గవర్నమెంటుచే **B. E.,** డిగ్రీకు సమానంగా రికగ్నయిజ్ కాబడిన **AMIE** అర్హతను కరస్పాండెన్సు ద్వారా పొందుటకు రివైజుడు స్కీము ఏర్పడియున్నది వివరములకు రూ॥5/- ఎం. ఒ. చేయండి.

**ఎన్. టి. జ్ఞానప్రకాశం, M.E., M.I.E.** ప్రిన్సిపాల్
**సర్కార్స్ ఇంజనీరింగ కాలెజి, మచిలీపట్నం - 52001 (A.P.)**

## కావలెను

అక్టోబరు యస్. యస్. సి ఇంటర్ వ్రాసిన విద్యార్థులారా ! 1980 అక్టోబరులో **S.S.C. Inter** పరీక్షలు వ్రాసి ఖాళీగా వున్న విద్యార్థినీ విద్యార్థులకు అగ్రికల్చరల్ కోర్సులో రెండు నెలలు శిక్షణ ఇచ్చి ఈ క్రింది ప్రభుత్వ ఉద్యోగములలో నియమించుటకు అర్హులు. ఉచిత భోజన వసతులతో ఒక్కొక్కరికి రు. 100/- స్టయిఫండ్ మరియు ఉచితముగా గ్రామరు, స్ప్రేపు, షార్టుహాండ్, స్ప్రేలరింగ్, ఎంబ్రాయిడరీ నేర్పబడును. స్త్రీలకు ప్రత్యేక హాస్టలు కలదు. **Postal** ద్వారా కూడా శిక్షణ ఇవ్వబడును. ఉద్యోగములు: **1 Field Man 2. Field Asst 3. SubAsst 4. Tech Asst** అన్ని వివరములకు ఈ క్రింది అడ్రసుకు ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా రు. 4/- **M.O.** ద్వారా పంపి అప్లికేషన్ & ప్రాస్పెక్టసును పొందవచ్చును.

**PRINCIPAL, S. V. T. A T. College,**
Post Box No. 30, Chilakaluripet-522616, GUNTUR (Dt).

## ఇది జీవితం

రిం చుకుని, మీరు అంగీకరిస్తే మాత్రం ఆర్థికంగా సహాయం చేయగలను అంతకన్న ఎక్కువ నేను మాత్రం ఏం చేయగలను? ఏం చేయగలనో మీరే చెప్పండి !'' ఎంతో ఆలోచించిన మీదట ఒక్కొక్క అక్షరాన్ని అతి జాగ్రత్తగా తూచి చూచి చెప్పింది. చెప్పినాక గుండెలపై నుండి ఏదో బరువు దించుకున్నట్లుగా తేలిగ్గా శ్వాస తీసుకుంది.

నిల్చునే వున్న ఆవిడ మాత్రం తలెత్తి తేరిపార చూసింది శబరివేపు. క్రమక్రమంగా పాలిపోయిన పెదాలు బలహీనంగా విచ్చుకున్నాయి— ''మీ వుదార స్వభావానికీ, స్నేహానికీ, మీరిచ్చే విలువకు కృతజ్ఞతలమ్మగారూ ! మీ నాన్నగారి గురించి, మీ గురించి వారంతా చెప్పారు. మీరిప్పుడు చెప్పిన ప్రతి అక్షరాన్నీ వారి నోటివెంట మొదటే విన్నాను. అయినా మా పరిస్థితులు... గుండెల్లో ఓ మూల మినుక్కు మినుక్కుమనే ఏదో ఆశా... అవే నన్నిక్కడికి నడిపించినయి సరేనమ్మగారూ ! అవకాశమొస్తే మళ్ళీ కలుసుకుంటాను. ఇప్పటికి సెలవిప్పించండి'' అనేసి అడుగులో అడుగు వేసుకుంటూ అతి నెమ్మదిగా, నీడలా కదలిపోయిందామె.

ఆమె వెళ్ళిన ఆ బాటవేపే చూస్తూ చిత్తరువులా కూర్చుండిపోయిన శబరి, ''ఏమ్మా! బాధ పడ్తున్నావా?'' అన్న తండ్రి వేపు బేలగా చూసింది. ఆ కళ్ళనిండా మెరిసే కన్నీరు. ఆ వలయాల్లో చిక్కుకుని వూగిసలాడే ఎన్నో ప్రశ్నలు...మరెన్నో సందేహాలు... ఏవేవో తెలియని భయాలు...

అవన్నీ చదివినట్లుగా మందహాసం చేశాడు రాజశేఖరం— ''జననమనే ఆదికీ...మరణమనే అంతానికి మధ్యన గజిబిజిగా ప్రయాణం సాగించే యీ జీవితంలో మనం వూహించని ఎన్నో విషయాలు అతి మామూలుగా జరిగిపోతాయమ్మా! ప్రకృతినే శాపించగలననుకునే మనిషిని భుజంతట్టి ''ఇదీ జీవితమంటే!'' అంటూ ఎప్పటి కప్పుడు హెచ్చరిస్తూనే వుంటుంది జీవితం. అవునమ్మా...! ఇదే జీవితమంటే!'' ఆ జీవితాన్నంతా రంగరించి పోసుకున్న యోగిలా చెప్పుకుపోయే తండ్రి వేపు మరింత బేలగా చూస్తున్న శబరిలో, అప్పటిదాకా మెలికలు తిరిగిపోతున్న వ్యథంతా కన్నీటి చుక్కలయి క్రిందికి రాలింది.